# నందిగామలో పది రోజులుగా నీటి కష్టాలు...



**నందిగామ ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ పట్టణ ప్రజలకు ప్రతిరోజూ రక్షిత మంచినీరు సరఫరా చేయాలని సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ లవరాజుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 20 వార్డుల్లో గత పది రోజులుగా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి గోపాల్ తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు తాగునీటి కోసం ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల అదనపు ఆర్థిక భారమూ పడుతోందన్నారు. పలుచోట్ల బోర్లు ఎండిపోవడం, పైపులైన్ సమస్యలు, సరఫరా వ్యవస్థలో లోపాలు కారణంగా నీటి సంక్షోభం ఏర్పడిందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ అధికారులు సమస్యను తక్షణం పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలు ఉదయం నుంచే బిందెలతో నీటి కోసం క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల తాగునీరు అందక మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలసి వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ప్రతి వార్డుకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. అలాగే పైపులైన్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. పట్టణ ప్రజలు మాత్రం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## దొనబండ సమీపంలో అనుమానాస్పద మృతి...



**నందిగామ ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇబ్రహీంపట్నం మండలం దొనబండ సమీపంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఖాళీ స్థలంలో ఒంటినిండా గాయాలతో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడిని చిలుకూరు గ్రామానికి చెందిన రామలింగేశ్వరరావు (49)గా గుర్తించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్యా కోణంలోనా, లేక మరేదైనా కారణమా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ముడి చమురు శుద్ధితో వెలువడే ఇంధన సంపద



**విజయవాడ , ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భూమి గర్భం నుంచి వెలికితీసే ముడి చమురు అనేక పారిశ్రామిక అవసరాలకు ఆధారంగా నిలుస్తోంది. ఈ ముడి చమురును నేరుగా వినియోగించడం సాధ్యం కాదు. ప్రత్యేక రిఫైనరీల్లో శుద్ధి ప్రక్రియల అనంతరం పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలు సిద్ధమవుతాయి. సాధారణంగా ఒక లీటరు ముడి చమురును శుద్ధి చేస్తే దాదాపు 450 నుంచి 500 మిల్లీలీటర్ల వరకు పెట్రోల్ లభిస్తుంది. మిగిలిన భాగంలో డీజిల్, విమాన ఇంధనం, వంట గ్యాస్ వంటి ఉత్పత్తులు తయారవుతాయి. అలాగే ఒక బ్యారెల్ (159 లీటర్లు) ముడి చమురు నుంచి సుమారు 73 లీటర్ల పెట్రోల్ ఉత్పత్తి అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ముడి చమురు నాణ్యతపై ఆధారపడి ఈ ఉత్పత్తి పరిమాణం మారుతుంది. ఇంధనాలకే పరిమితం కాకుండా తారు, ప్లాస్టిక్, ఔషధాల తయారీలోనూ ముడి చమురుకు కీలక పాత్ర ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముడి చమురు ప్రాధాన్యం మరింత పెరుగుతోంది.

# టో నగర్ లో చిన్న పరిశ్రమల వారికి కాలుష్య నియంత్రణ పట్ల ప్రభుత్వం భరోసా కల్పించాలి

**డ్యామేజ్ అయిన భూగర్భ జలాలను ప్రభుత్వం రీ సైక్లింగ్ చేసి కలుషితం అయిన నీటిని మంచి నీళ్ళు గా మార్చాలి**

**కాలుష్యం వల్ల డ్యామేజ్ అయిన బోర్లు ఉన్న ప్లాట్ల వారికి పన్నులను పూర్తిగ రద్దు చేసి,వారిని ప్రభుత్వం ఆదుకోవాలి....**

**జగ్గయ్యపేట ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జగ్గయ్యపేట పట్టణంలో ఆటో నగర్ ఏపిఐఐసి ద్వారా కుటీర,చిన్న,మధ్య తరహా పరిశ్రమల కోసం సుమారు 496 ప్లాట్లలను ప్రభుత్వం కేటాయించింది.దీనిలో ఆటో నగర్ లో కుటీర,చిన్న తరహా పరిశ్రమల కోసం సుమారు 323,ఇండస్ట్రీయల్ పార్క్ లో మధ్య తరహా పరిశ్రమల కోసం సుమారు 173 ప్లాట్లను ప్రభుత్వం కేటాయించినట్లు తెలుస్తోంది.ఈ 496 ప్లాట్లలో సుమారు 380 నిర్మాణాలు పూర్తి అయి వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఐలా వారు డెవలప్మెంట్ కోసం అసెస్మెంట్ నెంబర్లను కేటాయించి,వారికి పన్నులను విధించడం జరుగుతుంది.31 మార్చి 2026 నాటికి ఆటోనగర్,ఇండస్ట్రీయల్ పార్క్ లో గల ప్లాట్ల వారు సుమారు 79 లక్షల20 వేల రూపాయలు డిమాండ్ తో కూడిన పన్నులను ఐలాకి చెల్లించాల్సి ఉంది.దీనితో పాటు పన్నుల పాత ఎరియర్స్ బకాయిలు సుమారు 72 లక్షల 01 వేయి రూపాయలు గా ఉన్నట్లు తెలుస్తోంది.ఈ ఎరియర్స్ బకాయిలో మొండి పదులుగా సుమారు 70 ప్లాట్ల వారు ఉన్నట్లు సమాచారం.2026 మార్చి నాటికి 55 లక్షల 66 వేల రూపాయలు వసూలు అయిన్నట్లు,72 లక్షల 01 వేల ఎరియర్స్ లో 14 లక్షల 87 వేల రూపాయలు మాత్రమే వసూలు అయినట్లు సమాచారం.ప్రస్తుతం సుమారు 120 ప్లాట్ల వారి వద్ద నుండి ఐలా కి పన్నుల రూపంలో సుమారు 80 లక్షల 67 వేల రూపాయలు చెల్లించాల్సి ఉందని ఐలా వారు అంటున్నారు.ఇండస్ట్రీయల్ పార్క్ లో ఉన్న పలు మధ్య తరహా కర్మాగారాల వల్ల వస్తున్న కాలుష్యంతో డ్యామేజ్ అవుతున్నా యని,తద్వారా పనులను చేసుకోలేకపోతు న్నామని ఆటోనగర్ లో కొందరు ఆరోపణలు బలంగా చేస్తున్నారు.మరో పక్క ఇండస్ట్రీయలో పార్క్ లో ఉన్న వారు మాత్రం కొందరు పనిగట్టుకొని పాడైన ఒక్కటి రెండు బోర్లను చూపించి,మొత్తం పొల్యూషన్ అయిందని వారి మీద నెపం మోపటం సరికాదని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాదిస్తున్నట్లు తెలుస్తుంది.ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు సకాలంలో స్పందించి కాలుష్య సమస్యలను పరిష్కరించకపోవడంతో సమస్య జగ్గయ్యపేట ఆటోనగర్ ప్రాంతంలో మరింత ముదిరిందని చెప్పుకోవచ్చు.దీనితో ఆటో నగర్ ప్లాట్ల లో పనులు,వ్యాపారలు చేసుకోవాలంటే కొందరు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని దీనికి ఎవ్వరు కారణమని ప్రశ్నలు తలెత్తుతున్నాయి .జగ్గయ్యపేట ఆటోనగర్ కాలుష్యం కాస్త ప్రజా ఉద్యమంగా మారింది.దీనికి అధికారులు పాపం మూటగట్టుకున్నారనే చెప్పుకోవచ్చు.ఒక్క పక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇండస్ట్రీయల్ అభివృద్ధి చేయాలనే ఆలోచిస్తుంటే,మరో పక్క అధికారుల వైఫల్యం వల్ల కర్మాగారాల కాలుష్యాని నియంత్రించే పర్యవేక్షణలో లోపభూయిష్టంగా మారడం కాలుష్యం తో ప్రజా ఉద్యమాలు ముందు పీఠాన నిలబడుతున్నాయనే చెప్పుకోవచ్చు. ఇప్పటికే ఇటువంటి చర్యల వల్ల జగ్గయ్యపేట కి వచ్చే డిఫెన్స్ పరిశ్రమ పరిస్థితి తెలంగాణ కి తరలి వెళ్ళేటట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వ అధికారులు కాలుష్యం పై సరైన నిర్ణయంతో పరిష్కరించాలని,ఆటో నగర్ ప్లాట్లలో డ్యామేజ్ అయిన బోర్లు గల వ్యాపార వర్గాల కు పూర్తిగ పన్ను మినహాయింపులు ఇచ్చి,వారికి నష్టపరి హారం అందించాలని,ఐలా నిర్వహణలో వస్తున్న సమస్యలను పరిష్కరించలేని,ే ఎరుకుపోతున్న పన్నుల బకాయిల వసూలు జాప్యం చేస్తున్న అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకొని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# నరసరావుపేటలో క్రికెట్ బుకీలు అరెస్టు..



**నరసరావుపేట ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా కేంద్రంలో నరసరావుపేట పట్టణంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు క్రికెట్ బుకీలను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిఎస్పి హనుమంతరావు మాట్లాడుతూ... పట్టణంలోని బరంపేట, ఐలా బజార్‌లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతోందని పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురునీ అరెస్టు అరెస్టు చేశారు. బెట్టింగ్ ముఠా సభ్యులు షేక్ ఖాసీం, షేక్ మస్తాన్ వలీ, షేక్ రఫీ జాన్, పసుపులేటి నాగరాజు, శిఖా చక్రవర్తి, పతేలా వెంకటేశ్వరరావులు గా గుర్తించారు. నిందితుల నుంచి రూ.4.58 లక్షల నగదు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులకు ఇన్చార్జి డిఎస్పి హనుమంతరావు బహుమతులు అందించారు.

## తిరుమలలో వాహన భద్రతపై అవగాహన కార్యక్రమం



**తిరుమల ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తూ, తిరుమల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుమలలోని పుష్పగిరి మఠంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనాల్లో అగ్ని ప్రమాదాలు (ఫైర్ యాక్సిడెంట్స్) జరగకుండా తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వాహనాల ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను సకాలంలో తనిఖీ చేయడం, ఇంధన లీకేజీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సరిచేయించడం, అధిక వేడి కారణంగా మంటలు చెలరేగే అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపై వివరించారు. డ్రైవర్లు తమ వాహనాలను శుభ్రంగా, సక్రమంగా నిర్వహించుకోవడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, ఎంవీఐ శ్రీనివాసులు, సెక్టార్ ఇన్‌ఛార్జ్‌లు శివకుమార్ రెడ్డి, కృష్ణయ్య, తిరుమల 2 టౌన్ సీఐ శ్రీరాముడు పాల్గొన్నారు.

## అప్పారావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**తాడేపల్లి గూడెం ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం సభా వేదికపై ప్రసంగించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రవాణా ఛార్జీలను ప్రభుత్వం నిర్ణయం మేరకు త్వరలోనే అందజేస్తామని జేసీ తెలియజేశారు. జిల్లాలోని తొలి కేంద్రం కావడంతో జిల్లా అధికారులు, మండల అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్కాన్ యాప్‌తో ఆటో ఆచూకీ..

### మహిళకు బ్యాగ్ అందజేసిన పోలీసులు



**విజయవాడ , ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి మరోసారి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. సోమవారం పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజా రావు విధుల్లో ఉండగా, ఒక మహిళ తన ఆటోలో బ్యాగ్ మర్చిపోయానని ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు 'స్కాన్ యాప్' సహాయంతో ఆటో వివరాలను గుర్తించారు. అనంతరం డ్రైవర్‌ను సంప్రదించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న విలువైన వస్తువులను సురక్షితంగా పరిశీలించి బాధితురాలికి అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలకు మహిళ కృతజ్ఞతలు తెలిపింది. ఈ ఘటన పోలీసుల సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది.

## బసాపురం కాల్వకు చేరుకున్న తుంగభద్ర జలాలు



**ఆదోని ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని పట్టణ శివారు బసాపురం ప్రాంతంలోని దిగువ కాలువకు మంగళవారం ఉదయం తుంగభద్ర జలాలు చేరుకున్నాయని పురపాలక కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. వేసవిలో నీటి కొరత నివారణ కోసం తుంగభద్ర జలాశయం నుంచి ఆదోని డివిజన్ ప్రాంతానికి నీటిని విడుదల చేశారని తెలిపారు. దీంతో డివిజన్‌లోని పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు నీటిని పంపించి వేసవిలో సమస్యలు రాకుండా యంత్రాంగం పంపింగ్ ప్రక్రియ చేపట్టనుందని అన్నారు. రెండు రోజుల్లో పంపింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని కమిషనర్ అన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఇంజినీర్ రామ్మూర్తి, సిబ్బంది ఉన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే



**నందిగామ ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ మండలం చందాపురం గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను కూటమి నేతలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. రీ సర్వేలో వచ్చిన తప్పులను సరిదిద్ది, రాజముద్రతో కూడిన నాణ్యమైన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. భూ రికార్డుల్లో తప్పులు సరిచేసి, రైతుల భూమి హక్కులను రక్షించడం ద్వారా వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని ఆమె పేర్కొన్నారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో భూముల వివరాలు, సర్వే నంబర్లు, సరిహద్దులు, ఆధార్ వంటి అన్ని వివరాలు సరిగ్గా ఉన్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాసుపుస్తకాల్లో క్యూఆర్ కోడ్ ఉండటం వల్ల భూమి సంబంధిత వివరాలు, మ్యాపులు సులభంగా తనిఖీ చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## చేనేతల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత: ఎమ్మెల్యే




**అనంతపురం ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. చేనేత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్జీవో హోంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాబోయే కాలంలో చేనేతల అభివృద్ధికి మరింత బాధ్యతగా పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను చేనేత నాయకులు సన్మానించారు.

## కంచికచర్ల గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారుల ఆందోళన



**కంచికచర్ల ఏప్రిల్ 07( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గత కొన్ని రోజులుగా గ్యాస్ సరఫరా ఆలస్యం అవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే కంచికచర్ల భాస్కర గ్యాస్ ఏజెన్సీ వద్ద గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు బారులు తీరారు. ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ల సరఫరాపై ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ సిలిండర్ కోసం కార్యాలయం వద్దకు వచ్చి గంటల తరబడి వేచి చూసి వెను దిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కంచికచర్ల-విజయవాడ జాతీయ రహదారిపై కొద్దిపాటి ఉద్రిక్తత చోటు చేసుకుంది.

## ఏప్రిల్ 09 న మూడవ గ్రామ ఆరోగ్య దర్శిని : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట, ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏప్రిల్ 09 న జిల్లా వ్యాప్తంగా ప్రతి స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయంలో గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వడగాలుల నుంచి జాగ్రత్తలు, ప్రతి బాలికకూ హెచ్ పీవీ వ్యాక్సిన్ నినాదంతో జిల్లాలో మూడవ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ ను నిరోధించే హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యతపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే వ్యాక్సిన్ వేయాలన్నారు. 14 ఏళ్లలోపు ప్రతి బాలికకూ హెచ్పీవీ వ్యాక్సిన్ చేయించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.4,000 లు విలువ చేసే వ్యాక్సిన్ ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. వడగాలులు తీవ్రంగా ఉండే వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. వడదెబ్బ, డయేరియా లక్షణాల గురించి వివరించాలన్నారు. వడదెబ్బపై ప్రచార పోస్టర్లను ఆరోగ కేంద్రాలు, సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. ప్రతి పాఠశాల, అంగన్వాడీల్లో ప్రతి గంటకు ఒక సారి వాటర్ బెల్ కొట్టి విద్యార్థులు అందరితో సరిపడా నీరు తాగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, ఆలయాలు, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు, షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.రవి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, వెబెక్స్ ద్వారా జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు




**మచిలీపట్నం ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం చిలకలపూడి సి. డబ్ల్యూ. సి గూడౌన్స్ దగ్గర వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం నందు మొదటి మంగళవారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ భక్తబృందం చే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిపించారు. మధ్యాహ్నం 12 గంటలకు వెంట్రప్రగడ షణ్ముఖ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## చేనేత శాలను ఏర్పాటు చేయిస్తా : ఎమ్మెల్యే పార్థసారథి



**ఆదోని ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని పట్టణంలో చేనేత శాలను ఏర్పాటు చేయించి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. మంగళవారం స్థానిక కిలిచినపేట అమ్మాభవాని కల్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు అందిస్తున్న ఉచిత విద్యుత్తు పథకంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదోనిలోనే అత్యధికంగా చేనేతలు ఉన్నారన్నారు. చేనేతలకు రావాల్సిన బకాయిల విడుదల చేయించడంతోపాటు.. కాలానుగుణంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు సాంకేతికమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. చేనేతల సంక్షేమానికి ఎంత చేసినా తక్కువేనని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ నాగరాజురావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి: డాక్టర్ శంకర్ శర్మ



**కర్నూలు ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ?ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం క్లినిక్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 'టుగెదర్ ఫర్ హెల్త్.. స్టాండ్ విత్ సైన్స్' అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ?ఆరోగ్యం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, మూఢ నమ్మకాలను వీడి సైన్స్ ఆధారిత వైద్య విధానాలను నమ్మాలని ఆయన సూచించారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లే అనారోగ్యానికి ప్రధాన కారణమన్నారు. జంక్ ఫుడ్‌కు అందరూ దూరంగా ఉండాలని సూచించారు.

## మచిలీపట్నంలో ఆదర్శ ప్రేమ వివాహం -- ప్రేమకు కొత్త నిర్వచనం..



**మచిలీపట్నం ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నంలో ఒక యువతి తన ప్రేమను నిలబెట్టుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలిచింది. ప్రేమకు రూపం, ఎత్తు, అందం వంటి భేదాలు లేవని, కులం--మతం కూడా అడ్డుకావని ఈ జంట మరోసారి నిరూపించింది. రాజుపేటకు చెందిన యువతి, మరుగుజ్జు వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అదే ప్రాంతానికి చెందిన వేముల శశి , ఓ ముస్లిం యువతి మధ్య 9వ తరగతిలో ప్రారంభమైన స్నేహం క్రమంగా ప్రేమగా మారి, ఇప్పుడు వివాహ బంధంగా మారింది. యువకుడు జిల్లా కోర్టులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, యువతి మెడికల్ షాప్‌లో పనిచేస్తోంది. ప్రేమలో ఎలాంటి అడ్డంకులు లేవని నమ్మిన ఈ జంట తమ నిర్ణయంపై నిలబడింది. అయితే ఈ ప్రేమ వివాహానికి పెద్దల అంగీకారం లభించలేదు. యువతి తల్లిదండ్రులు, బంధువులు ఈ వివాహానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనితో యువజంటకు కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరిగింది. తమ ప్రేమను కాపాడుకోవాలనే ఉద్దేశంతో యువజంట ఇనుకుదురుపేట పోలీసులను ఆశ్రయించింది. తమకు భద్రత కల్పించాలని పోలీసులను కోరింది. ప్రేమకు హద్దులు లేవని, నిజమైన అనుబంధం ఉంటే ఎలాంటి అడ్డంకులు ఎదురైనా దాటవచ్చని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది..

## గ్రామీణ వైద్యుల సేవలు అనన్య సామాన్యం



**మచిలీపట్నం ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గ్రామీణ వైద్యుల సేవలు అనన్యసామాన్యమని, డీఎంహెచ్వో డాక్టర్ యుగంధర్ అన్నారు. మంగళవారం గ్రామీణ వైద్యులు , రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రిజిస్టర్ ప్యానెల్ నాయకులు అధ్యక్షులు అయిన డాక్టర్ బి.ఆర్ ఆంజనేయులు కార్యదర్శి నందగోపాల్ జాయింట్ సెక్రటరీ బి ఆర్ ఆర్ సందీప్ కుమార్, కోశాధికారి. డేవిడ్ రాజు కృష్ణా జిల్లా కోశాధికారి తటవర్తి వాసుదేవ మూర్తి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నాయకులు దుర్గా రావు, బి అర్జున్ రావు,జవహర్ పీటర్ తదితరులు స్థానిక డిఎంహెచ్వో కార్యాలయంలో యుగంధర్ ను కలిసి గ్రామీణ వైద్యుల సాధక బాధకాలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో గ్రామీణ వైద్యులు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా యుగంధర్ కొనియాడారు. ఇదే స్ఫూర్తితో, రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్లకు నర్సింగ్ సిబ్బందికి సహకరించాలని కోరారు. అలాగే గ్రామీణ వైద్యులు తమ పరిధిలో వైద్య సేవలు అందించాలని నగరంలో ఇంకా కొంతమంది తమ పరిధి దాటి చేసే వైద్యానికి, యూనియన్ నాయకులు సంపూర్ణ బాధ్యత తీసుకోవాలని గ్రామీణ వైద్యుల సమావేశానికి ఆహ్వానిస్తే తాను తప్పక హాజరవుతానని డిఎంహెచ్వో అన్నారు. గ్రామాల పరిధిలో ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు గ్రామీణ వైద్యులు చేపట్టాలని, సంబంధిత జిల్లాల్లో మండల పంచాయతీ విభాగాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే కార్యక్రమాలకు డివిజన్ వారీగా గ్రామీణ వైద్యులు తమ తమ ఐడి కార్డ్స్ అసోసియేషన్ల అప్డేట్ రెన్యువల్స్ పూర్తిచేసుకుని వారి వద్దే ఉంచుకొని సంబంధిత అధికారులు వచ్చినప్పుడు అందజేయవలసిందిగా తెలియజేశారు. ప్రతి మూడు నెలలకు యూనియన్ యొక్క సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసుకొని సభ్యులు తప్పనిసరిగా అసోసియేషన్ నిబంధనలు పాటించి ప్రథమ చికిత్స నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల నాయకులు హాజరై డిఎంహెచ్వో ఆదేశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

## '12 ఏళ్లు పూర్తవుతున్నా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదు'



**శిరివెళ్ల ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వ్యవసాయ శాఖలో అధికారులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఎంపీవోలకు సమాన పనికి సమాన వేతనం రాష్ట్ర ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎంపీవోల రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌బాబు.. వ్యవసాయ శాఖ కమిషనర్ డా.మనజీర్ జిలానీకి వినతి పత్రం అందించారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ.. "2014లో రైతులకు అవసరమైన అన్ని సేవలను అందించేందుకు వ్యవసాయ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 6,400 మంది ఎంపీఈవోలను కాంట్రాక్ట్ ప్రాతిపాదికన నియమించారు. క్షేత్రస్థాయిలో ఏవో, ఏఈవోలతో సమానంగా ఎంపీఈవోలు విధులు నిర్వహిస్తూ 12 సంవత్సరాలు పూర్తి అవుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదు. నెలవారీ వేతనం రూ. 12 వేలు, ప్రోత్సాహకంగా రూ. 3 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా తమను రెన్యువల్ చేయాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి" అని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డి ప్రసాద్, శంకర్, మల్లేష్, భాస్కర్ నాయక్ ఉన్నారు.

## తూము ఏర్పాటుతో రెండు వేల ఎకరాలకు సాగునీరు



**వెల్దుర్తి ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** హంద్రీనీవా కాలువ నుంచి తూము ఏర్పాటుతో 2వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని జిల్లా తెదేపా నాయకుడు సుబ్బరాయుడు అన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మల్లేపల్లి సమీపంలో తూము ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈఈ ప్రసాద్ రావు, డీఈ హరి ప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు తూము ఏర్పాటు విషయంపై హంద్రీనీవా కాలువను పరిశీలించారు. మల్లేపల్లి పరిధిలోని కాలువ నుంచి తూము ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా పిల్ల కాలువలను ఏర్పాటు చేస్తే మల్లేపల్లి, నార్లపురం, బొమ్మిరెడ్డి పల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతుల సంక్షేమమే తెదేపా ధ్యేయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నబి సాహెబ్, తెదేపా నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కలసపాడులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ



**కలసపాడు ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సాయి తేజ, శైలజ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో వాయు కాలుష్యం, మానసిక ఒత్తిడి, ఫాస్ట్ ఫుడ్ కల్చర్ కారణంగా క్యాన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్ వస్తున్నాయన్నారు. దీని వల్ల చిన్న వయసులోనే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వస్తున్నాయని పేర్కొన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు వ్యాధి వచ్చిన తర్వాత చికిత్సకంటే ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిత్యం తీసుకునే ఆహారంలో తాజా ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు, ప్రొటీన్స్ ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా రోజు అరగంట కాలినడక, యోగా అలవాటు చేసుకుంటే చాలా వరకు వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. తొలుత టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా కడప మల్టీ పర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 15 మంది క్షయ వ్యాధి చికిత్స పొందుతున్న వారికి ఫాదర్ మనోహర్, వైద్యాధికారులు సాయి తేజ, శైలజ చేతులమీదుగా సంస్థ పోషకాహారం కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జాకబ్, భాస్కర్, సామాజిక ఆరోగ్య అధికారి వెంకట సుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఆశా లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మూల్యాంకనం కేంద్రాన్ని సందర్శించిన ఆర్జెడి నాగమణి



**మచిలీపట్నం ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం లేడీ యాంప్తిల్ పాఠశాలలో ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతోంది. రెండవ రోజు జరుగుతున్న పదవ తరగతి పరీక్షా మూల్యాంకన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు స్పాట్ కేంద్రాన్ని ఆర్జేడీ నాగమణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మూల్యాంకన ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. మూల్యాంకనం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. కేంద్రంలో ఉన్న సదుపాయాలను పరిశీలించి అవసరమైన సూచనలు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యువి సుబ్బారావు , ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తవ్వి తీసి.. పోస్టుమార్టం



**కలసపాడు ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం యంబడి శ్యామల (37) మృతదేహానికి వైద్యాధికారులు పోస్టుమార్టం చేశారు. ఈ నెల 3న రాత్రి శ్యామల ఆమె భర్త యేసయ్యకు గొడవ జరిగింది. అదే రోజు రాత్రి అనుమానస్పద స్థితిలో శ్యామల మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులు పూడ్చివేశారు. గ్రామస్థుల సమాచారంతో ఆమె మృతిపై అనుమానాలు ఉన్నట్లు వీఆర్వో వెంకట సుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఐ హేమసుందర్రావు, ఎస్ఐలు సుభాన్, యోగేంద్ర ఆధ్వర్యంలో శ్యామల మృతదేహాన్ని బయటకు తీయించి వైద్యాధికారులు పంచనామా చేశారు. మృతురాలి భర్త యేసయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

## ల్యాబ్ టెక్నిషియన్ లకు సన్మాన కార్యక్రమం




**మచిలీపట్నం ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా విజయవాడ మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మచిలీపట్నం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నంకు చెందిన దివ్య డయాగ్నటిక్ సెంటర్ అధినేత పసుమర్తి రాంబాబుకు, శిల్ప డయాగ్నటిక్ సెంటర్ అధినేత కలపాల కృప ఫ్రెడ్ పాల్ లకు దుశ్యాలువా తలపాగా పూలదండ సన్మాన పత్రంతో సత్కరించారు. సుమా డయాగ్నెట్ సెంటర్ అధినేత్రి గ్లోరీ కుట్టి విజయవాడ దివ్య డైరెక్టర్ సెంటర్ అధినేత మీసాల నారాయణ ఇతర డయాగ్నటిక్ సెంటర్ వారు వీరికి అభినందనలు తెలిపారు

## పేర్ని కుటుంబంపై విమర్శలు చేస్తే సహించం. మాజీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న.



**మచిలీపట్నం ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) బందరు నియోజకవర్గ వైయస్సార్సీపి ఇంచార్జ్ పేర్ని కిట్టులపై, పేర్ని కుటుంబం పై ఇష్టారాజ్యంగా మాట్లాడితే వైసిపి కార్యకర్తలు ఎవ్వరు సహించరని మాజీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న ఘాటుగా స్పందించారు. ఇటీవల కొరియర్ శీను పెట్టిన ప్రెస్ మీట్ కి ప్రతిస్పందనగా ఆయన మాట్లాడుతూ పేర్ని కృష్ణమూర్తి కుటుంబం పై అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మంగళవారం స్థానిక రామానాయుడుపేట వైయస్సార్సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన పేర్ని కుటుంబాన్ని విమర్శించే స్థాయి జనసేన నాయకులకు లేదన్నారు. తమతో బాటే ఉండి జనసేనలో చేరిన కొరియర్ శ్రీను ఇప్పుడు ఇష్టారాజ్యంగా పేర్ని నాని,కిట్టులను విమర్శించడం సహేతుకం కాదన్నారు. ఏ పార్టీ వారైనా, పరామర్శించడం పేర్ని కుటుంబ నైజం అన్నారు. కొబ్బరి తోటలో ఇల్లు కూల్చిన వారి ఇంటికి వెళ్లి పేర్ని నాని కిట్టులు కుటుంబ సభ్యులను పరామర్శించడం తప్పా?అని ప్రశ్నించారు. సుబ్బన్న మాట్లాడుతూ పేర్ని కృష్ణమూర్తి కుటుంబానికి ఎంతో ఘన చరిత్ర ఉందని, అలాంటి కుటుంబం పై అపవాదులు వేస్తే సహించం అన్నారు. తాను 20 సంవత్సరాలుగా నిజాయితీగా వ్యాపారం చేస్తున్నానన్నారు. నగరంలో తాగడానికి నీరు దొరకదు కానీ, 34 పంచాయితీల్లో యదేచ్ఛగా 24 గంటలు మద్యం ఏరులై పారుతోందని దీనికి స్థానిక మంత్రి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మంత్రి ఇలాకాలో మంచినీళ్లు దొరకవు కానీ,మద్యం, బెల్టు షాపులు విస్తారంగా దొరుకుతాయన్నారు. ఇది అబద్ధమైతే తాను కోనేరు సెంటర్లో ముక్కు నేలకు రాసి, తన ఆస్తులను ఎవరికి వ్రాయమంటే వాళ్ళకి రాసి బందరు వదిలి వెళ్ళిపోతానన్నారు. జనసేన పార్టీ జెండా కట్టే దమ్ముంటే వచ్చి పేర్ని నాని ఇంటి ముందు కట్టండి. అప్పుడు తాము ఏంటో చూపిస్తాం, అని సవాలు విసిరారు.

## మద్యంబాబులపై కడప ట్రాఫిక్ పోలీసుల కొరడా



**కడప ఏప్రిల్ 07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు కడప నగరంలో పోలీసులు మంగళవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సీఐ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com